# వత్తి

ఆ రోజు శివరాత్రి.

సాయంకాలం శివ పూజకు అన్నీ సిద్ధం చేస్తూ కాంతమ్మ – "ఏవండి! కాస్త జాగరణ ప్రమిదలోకి వత్తి చేయరూ" అని భర్త చేతికి దూది అందించింది.

బాసింపట్టు వేసుకు కూర్చుని వత్తి చేయడానికిఉపక్రమించాడు వరదయ్య.

దూది తెల్లగా, మల్లెమొగ్గలా... మంచు ముక్కల్లా... పొట్ల పూవులా... పున్నమి వెన్నెల్లా ఉండాలి కాని, మసిబారినట్లు, మురికి పట్టినట్లు ఇలా ఉందేం దూది! పాత సరుకును అంటగట్టాడేమో దుకాణం వాడు.

షాపు విషయం గుర్తుకు రాగానే వరదయ్య ఒళ్లు జలదరించింది. పోయిన నెల బాకీ అలాగే ఉంది. ఈ నెల ఇంత వరకు జీతాలు లేవు. ఒక్క నెలైనా మొదటి తేదీన జీతాలు అందిన పాపన పోలేదు. అందుకే బతకలేక బడి పంతులు అన్నారు. మహాత్మాగాంధీ, టాగోర్, అరిస్టాటిల్ లాంటి వాళ్లేమన్నారు? బడిపంతులు 'జాతి నిర్మాత' అన్నారు. మొన్న మొన్న రాజకీయాల్లోకి దిగిన ఒక ఢిల్లీ మంత్రిగారు ఏమన్నారు? పని చేతగాని వారే వాగుతారని పంతుళ్లను అపహాస్యం చేశాడు. ఆ సామెత ఎవరికి వర్తిస్తుందో ఆ మంత్రి మహాశయులకు తెలియదు.

జీతాల గురించి హెడ్మాస్టర్‌ను అడగాలంటే అందరికి భయమే. నెల మొదటి వారంలో ఎవరైనా ఆఫీసు గదిలో అడుగు పెడితే ఆయన – "ఏవిఁటీ! జీతాల గురించి వాకబు

చేయడానికేనా?" అంటూ అలా ఎగాదిగా చూస్తారు. తనకు మాత్రం జీతం అక్కరలేనట్టు! లేదు కాబోలు. భార్య సంపాదిస్తున్నది కదా. గవర్నమెంట్ ఆఫీసులో ఉద్యోగం. టంచనుగా ఒకటో తేదీనాడు జీతం వచ్చి వొళ్లో పడుతుంది. బతుకంటే వాళ్లది. ఉద్యోగమంటే అదీ! నెలంతా గొంతు చించుకొని... ఊపిరి అమ్ముకొని పాఠాలు చెబితే... చివరికి మిగిలేది నిరాశ. నిస్పృహ! జీతం ఎన్నడు వచ్చేదీ తెలియని అయోమయ పరిస్థితి! ఒక్కసారి రెండు, మూడు, నాలుగు నెలల వరకు కూడా జీతాలు రావు. ఇది వెట్టిచాకిరి కాదా...? ఇరవై సూత్రాలని, ముప్పై సూత్రాలని... సూత్రాల కేం... చాలానే వల్లిస్తారు. ఏ ప్రభుత్వం వచ్చినా పంతుళ్ల ఉసురు పోసుకునే వాళ్లే కదా!

"ఏవండీ! వత్తి అయిందా?"

"ఆఁ... ఆఁ..." ఉలిక్కిపడ్డాడు వరదయ్య.

దూదిని పింజలు పింజలు చేసి వత్తిగా పేనడానికి అరచేతిలో వేసుకున్నాడు.

ఎయిడెడ్ కాలేజీ లెక్చరర్ల బతుకూ ఇంతేనట! చూడబోతే పెద్దపెద్ద స్కేళ్లే కాని... నెల నెలా వాళ్లు కూడా జీతాలకు ఎదురుచూపులేనట! మా క్లాస్‌మేట్ వైకుంఠం మొన్న కలిసినప్పుడు ఏవన్నాడు... "పంతుళ్ల మంతా ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం! చుట్టూ అల్లకల్లోలాల అలలు... ఊగిసలాడే పడవ!"

పైగా పంతుళ్లు 'మాకు జీతాలు సక్రమంగా చెల్లించండి' అని అడగకూడదట. నోరెత్తకూడదట, సమ్మెలు చేయకూడదట. హూందాకాదట. ఏం? పంతుళ్లకు సంసారం, భార్యా, పిల్లలు లేరా? వాళ్లకు అవసరాలు లేవా? జీతం రాలేదని ప్రతి నెలా చెబితే... షాపువాడు ఊరుకుంటాడా? పాలవాడు ఆగుతాడా? పంతుళ్లకేమైనా ప్రత్యేక సదుపాయా లున్నాయా సమాజంలో? పంతుళ్లకు ఇల్లు అద్దె కివ్వడానికి యజమానులు జడుస్తున్నారు?

"ఏవండీ... వత్తి అయిందా?"

"అవుతున్నదే..."

ఆ గల్ఫ్ బాంబు లేవో ఇండియా మీద పడితే బాగుండేది. బతికి బట్ట కట్టిన వాళ్లయినా మంచి సమాజాన్ని నిర్మించుకునే వాళ్లు!

పెద్దాడి కాలేజీ ఫీజు కట్టాలి - ప్రిన్సిపాల్‌ని బతిమిలాడితే ఊరుకున్నాడు కాని, పరీక్ష ఫీజు ప్రిన్సిపాల్ చేతిలో లేదే! ఆలస్యమైతే యూనివర్సిటీకి 'లేట్ ఫీ' కట్టాలి.

ఇంకా ఆలస్యమైతే రెట్టింపు రుసుము కట్టాలి. పెరుగుతున్న ధరలకు తోడు, సమయానికి రాని జీతం ఇలా ఖర్చు పెంచుతుంది... అప్పులు పెంచుతుంది. రెండోవాడు ఫీజు కట్టలేక ట్రైపు మానేశాడు. అక్కడ ఆలస్యమే కదా!

అమ్మాయి పెళ్లీడుకు వచ్చాక ఇంకెన్ని తంటాలో! పంతులు అనగానే అప్పు ఇచ్చే చేతులు వెనక్కి పోతాయే!

సమాజంలో పంతుళ్లకు విలువ లేకుండా చేస్తున్నదెవరు?

సమస్యల సూదులు గుచ్చుతుంటే పంతుళ్లు నిండు మనసుతో పిల్లలకు పాఠాలు ఎలా చెబుతారు? వారిని ఉత్తమ పౌరులుగా ఎలా తీర్చిదిద్దుతారు?

కూరగాయలమ్మి నిన్న ఎంత అవహేళనగా మాట్లాడింది!

"ఏంది సారూ...ఏ నెల సక్కంగబాకీ ఇయ్యరు. ఎప్పుడడిగినా జీతాలురాలేదంటారు. మీకు నోరూ లేదా 'జీతాలు సక్కంగ ఇయ్యుండ్రి' అని గట్టిగ అడిగెతానికి?"

కూరగాయ లమ్మి మొహం చూడాలంటేనే భయం! వీధిలో ఆమె కేక వింటేనే గుండెలో గుబులు పుడుతుంది. హేళన చేస్తే చేసింది కాని, మంచి ఉపదేశం చేసింది. శంకరాచార్యుల వారికే తప్పలేదు... 'తమ్ముడి' ఉపదేశం!

ఇంటి యజమాని మాట వినబడితే కూడా గుండె దడ దడ లాడుతుంది. రెండు నెలల అద్దె బాకీ అలాగే ఉన్నది. ఈ నెల ఇంత వరకు జీతం వచ్చే సూచన లేదు. ఏ క్షణంలో సామాను వీధిన పారేస్తాడో... పరువును బజారు కీడుస్తాడో! శివశివ... ఈ సంసారం చేయలేను స్వామీ!

"ఏవండీ! ఇంకా వత్తి కాలేదూ?!" పనులు చేసుకుంటూ వచ్చి చూసింది కాంతమ్మ.

భర్త చేతిలో దూది అలాగే ఉంది కాని, వత్తి కాలేదు.

ఆ దూది అందుకొని క్షణంలో వత్తిని చేసింది.

అయిదు నిముషాలైనా ఆ పని చేయలేకపోయాడు వరదయ్య.

"అదృష్టవంతురాలివే కాంతం!" అన్నాడు భార్య వంక చూస్తూ....

"ఎందుకు?" వత్తిని నూనె ప్రమిదల్లో వేస్తూ అడిగింది కాంతమ్మ.

"ఆలోచన్ల అగాథంలో తప్పిపోయాను కాంతం.... ఆ వత్తి చేయలేకపోయాను. నువ్వు అరనిముషంలో చేశావు. అదృష్టవంతురాలివి కదూ?"

"చేతు లెక్కడో మనసక్కడ ఉండాలని మీకు తెలియనిదా? పరిస్థితులు మీ మనసుకు నిలకడ, లేకుండా చేస్తున్నాయి."

"హూఁ..." నిట్టూర్చాడు వరదయ్య. "ఈ పరిస్థితులు నన్ను పీల్చి పిప్పి చేస్తున్నాయి కాంతం."

"మీరేం దిగులు పడకండి. మనకూ, దేశానికీ మంచి రోజులు తప్పక వస్తాయి." అన్నది ఓదార్పుగా కాంతమ్మ దీపం వెలిగిస్తూ!

కూర లమ్మి మాటలు వరదయ్య చెవుల్లో గింగురుమంటున్నాయి.

*ఆంధ్రప్రభ వీక్లీ, ఏప్రిల్ 1992*